పుల్లూరు ప్రజల గోదావరి నెరవేరిన జల కల

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

పుల్లూరు గ్రామ ప్రజలకు ఎన్నాళ్ల నుండో ఉన్న గోదావరి జలాల కల నెరవేరింది. గ్రామ చెరువుల్లోకి గలగల పరవళ్లతో గోదావరి నీరు చేరడంతో రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీష్ రావు ప్రత్యేక కృషితో పుల్లూరు చెరువులకు గోదావరి జలాలు చేరేలా కాలువ పనులు చేపట్టారు. రైతులను ఒప్పించి కాలువ తవ్వించడంతో పాటు, పనుల్లో నష్టపోయిన రైతులకు తన స్వంత ఖర్చులతోనే డబ్బులు చెల్లించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత సంవత్సరం కూడా దాదాపు రూ.5 లక్షల వరకు స్వంతంగా ఖర్చు చేసి కాలువ పనులు పూర్తి చేయించారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి, రైతులను ఒప్పించి కాలువ ద్వారా చెరువులకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పుల్లూరు గ్రామ రైతుల పంట పొలాలకు నీరు అందే పరిస్థితి ఏర్పడింది. కాలువ నుంచి చెరువుల్లోకి నీరు రావడంతో గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు కలిసి ఆయనకు పాలాభిషేకం నిర్వహించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

బిసి హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

-యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్

గజ్వేల్ టౌన్, మార్చి 31 (ప్రభాతవార్త): సిద్దిపేట జిల్లాలోని బిసి హాస్టళ్లలో వార్డెన్లు సమయానికి విధులకు హాజరు కాకపోవడంవల్ల హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, దీనికి ప్రధాన కారణం వార్డెన్ల నిర్లక్ష్య ధోరణి అని యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్ ఆరోపించారు. హాస్టల్ అనేది పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఒక ఆశ్రయం అని, అలాంటిచోట వార్డెన్లు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు సమయానికి ఆహారం అందకపోవడం, పరిశుభ్రత లోపించడం, భద్రత సమస్యలు తలెత్తడం వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయని అన్నారు. రాత్రి వేళల్లో వార్డెన్లు లేకపోవడం వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతు న్నారని అన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం నియమించిన వార్డెన్లు తమ బాధ్యతలను విస్మరించడం సమంజసం కాదని, విధులను నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జోగినాథస్వామికి పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

శివపార్వతుల కళ్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి

జోగిపేట, మార్చి 31, (ప్రభాతవార్త): జోగినాథ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన శివపార్వతుల కళ్యాణోత్సవంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. కళ్యాణానికి విచ్చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి భక్తిశ్రద్ధలతో జోగినాథ స్వామికి పూజలుచేశారు. కళ్యాణోత్సవానికి ప్రజలు భారీ సంఖ్యలో విచ్చేశారు. అనంతరం అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా బుధవారం అర్ధరాత్రి జరిగే లంకాదహన కార్యక్రమంతో జోగినాథ స్వామి జాతర ఉత్సవాలు ముగుస్తాయి.

గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, మార్చి 31, ప్రభాతవార్త : మెదక్ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని మెదక్జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామసభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతోపాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపిడిఓలు గ్రామసభలకు హాజరు కావాలని స్పష్టంచేశారు. గ్రామసభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మంగళ వారం ఒక ప్రకటన తెలిపారు.

సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

36 ఎజెండా అంశాలకు ఆమోదం

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

మున్సిపల్ సాధారణ సమావేశం దృశ్యం

సిద్దిపేట పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 36 ఎజెండా అంశాలను సమావేశంలో చర్చించి పాలకవర్గం ఆమోదించింది. కౌన్సిల్ సభ్యులు పట్టణానికి సంబంధించిన పలు సమస్యలను చైర్పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్పర్సన్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ షట్టర్లకు గేట్లు, గ్రిల్స్ ఏర్పాటు, నీటి సరఫరా వాహనం అద్దె, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు, వీధి దీపాల నిర్వహణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ, వర్షాకాలం దృష్ట్యా మురుగు కాలువల పూడిక తొలగింపు, ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల మరమ్మతులు, వనమహోత్సవం కార్యక్రమాలు, హైమాస్ట్లైట్లు ఏర్పాటు, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం మరమ్మతులు, మున్సిపల్ ఖాళీ ప్రదేశాలకు ఫెన్సింగ్ ఏర్పాటు తదితర పనులకు నిధులను కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని 43 వార్డుల్లో వీధిదీపాల నిర్వహణ, ఎల్ఈడీ డ్రైవర్లు, ఇతర సామాగ్రి కొనుగోలు, పారిశుధ్య వాహనాల నిర్వహణ, పాఠశాలల సానిటేషన్ సర్టిఫికెట్లు, రోడ్స్ స్వీపింగ్ మిషన్ సర్వీసింగ్, కొన్ని వార్డుల్లో ప్రహరీ గోడల నిర్మాణం వంటి పలు అంశాలకు సమావేశం ఆమోదం తెలిపింది. మొత్తంగా పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు కౌన్సిల్ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ లభించింది. సమావేశంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసిన నేతలు

అక్కన్నపేట, మార్చి 31, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం రోజున హుస్నాబాద్ ఎమ్మెల్యే, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ని హైదరాబాద్లోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అక్కన్నపేటలో చౌడలమ్మ, గంగాదేవి ఆలయ నిర్మాణం, ఉత్సవాల నిర్వహణకు సహాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. వినతిని సానుకూలంగా స్వీకరించిన మంత్రివర్యులు ఆలయ నిర్మాణానికి రూ.50,116/ విరాళాన్ని ప్రకటించి అందించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ జన్నారపు సంపత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపెల్లి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ బండి సమ్మయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు కాశబోయిన సమ్మయ్య, పెద్ద గొల్ల లంబ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 31, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా, వచ్చే నెల ఏప్రిల్ 2వ తేదీ నుండి జిల్లాలో నిర్వహించనున్న గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి తదితరులతో కలిసి నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో గ్రామసభల ఏర్పాటుపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామసభ ఉదయం 10 గంటలకు ప్రారంభించాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికకుసంబంధించిన వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని, ప్రతి పథకం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభలో వ్యవసాయ శాఖకు సంబంధించిన రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, యాంత్రీకరణ పథకాలు, అలాగే ఆహార భద్రత, రేషన్ కార్డుల ద్వారా ఇంటింటికి సన్నబియ్యం పంపిణీ, చేయూత, మహాలక్ష్మి, గృహజ్యోతి, మహిళా శక్తి, ఎస్హెచ్జీ రుణాలు, ఉపాధి హామీ పనులు తదితర ప్రభుత్వ పథకాలపై పూర్తి వివరాల సమాచారం అధికారుల వద్ద సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మహిళా రైతులకు రైతుబీమా, పింఛన్లువంటి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. త్వరలో అమలుకానున్న ప్రభుత్వ కొత్త పథకం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అన్ని కుటుంబాలకు వర్తిస్తుందనే విషయాన్ని తెలియజేయాలని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా వంటి కొత్త పథకాల వివరాలు గ్రామసభలలో వివరించాలన్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, రైతులు, మహిళా సంఘాలు తదితరులు గ్రామసభలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామసభల వివరాలను నోటీస్ బోర్డులలో ప్రదర్శించడంతో పాటు దండోరా, పోస్టర్ల ద్వారా గ్రామ ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

గ్రామసభలలో లబ్ధిదారుల జాబితాలు తప్పని సరిగా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కొత్త దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లు, ఫీడ్ బ్యాక్ బాక్స్లు ఏర్పాటు చేయాలని, గ్రామసభలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు కూడా ప్రతి గ్రామపంచాయతీకి హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షి ంచాలని ఆదేశం చారు. ఈ వీడియో సమీక్ష సమావేశంలో మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

అన్నారంలో మిషన్ భగీరథ ట్యాంకులను పరిశీలిస్తున్న డీఈ

అన్నారం మిషన్ భగీరథ ట్యాంకులను పరిశీలించిన డీఈ

పాపన్నపేట, మార్చి 31 (ప్రభాతవార్త): మండల పరిధిలోని అన్నారం గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలుచేస్తున్న మిషన్ భగీరథ పథకం పనితీరును తెలుసుకునేందుకు డిఈ పల్లవి మంగళవారం పరిశీలించారు. పాపన్నపేట మండలం పరిధిలోని అన్నారం గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంకులను పరిశీలించి నీటి సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ట్యాంకులకు వచ్చే నీటి ప్రవాహం, నిల్వ స్థాయి, పంపింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించారు. నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరుపై ప్రత్యేక దృష్టి సారించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలకు సమయానికి తాగునీరు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ట్యాంకుల పరిస్థితి, నీటి సరఫరా, ఎదురవుతున్న సమస్యలపై గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి నీటి సరఫరా పరిస్థితిపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట రాణి సుధీర్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

ఇసుక వేలంతో రూ. 94 వేల ఆదాయం...

పాపన్నపేట, మార్చి 31, ప్రభాతవార్త : సీజ్ చేసిన ఇసుక వేలం ద్వారా 94 వేల యాభై రూపాయల ఆదాయం రెవెన్యూ శాఖ కు సమకూరినట్లు తహసీల్దార్ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిత్రియాల లో గత కొన్ని రోజుల క్రితం రెవెన్యూ అధికారులు మంజీర నది నుంచి అక్రమంగా ప్రోగుచేసిన ఇసుకను తాసిల్దార్ సిబ్బంది సీజ్ చేసిన విషయం పాటకులకు విదితమే కాగా మంగళవారంవేలంపాట చిత్రియల్ లో బహిరంగ వేలం 165 క్యూబిక్ మీటర్ల ఇసుక గా గుర్తించిఒక్క క్యూబిక్ మీటర్ కు 570 రూపాయలుగా నిర్ధారించి తాసిల్దార్ సతీష్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన శేఖయ్య 94 వేల యాభై హెచ్చు పాట పాడి కైవసం చేసుకున్నట్లు తాసిల్దార్ సతీష్ తెలిపారు.

మితిమీరిన వేగం వల్లే రోడ్డు ప్రమాదాలు

-సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్

ములుగు, మార్చి 31 (ప్రభాతవార్త):

మితిమీరిన వేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం మెడికల్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి రష్మీపెరుమాళ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యం రోడ్డుప్రమాదాలలో ప్రజలు మృతి చెందుతున్నారని, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహనరాహిత్యం, రాంగ్రూట్లో డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అంతేకాకుండా మత్తుపదార్థాల వినియోగం, గంజాయి వంటి నిషేధిత ఉత్ప్రేరకాలను వినియోగించడం శారీరక, మానసిక, ఆరోగ్యాలకు హానికరమని, చట్టరీత్యా నేరమని తెలిపారు.

అత్యాశతో ఆర్థికంగా నష్టపోవద్దు

ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, చదువుకున్న యువత అత్యాశకుపోయి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి ఆర్థికంగా పోతున్నారని పోలీస్ కమిషనర్ రష్మీపెరుమాళ్ అన్నారు. దీనిని నివారించడానికి ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాలలో ర్యాగింగ్ ఒక సవాలుగా మారిందని, విద్యార్థులందరూ ర్యాగింగ్కు దూరంగా ఉంటూ తోటి విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. 24 గంటలు విధులు నిర్వహించే పోలీసులు, వైద్యుల మధ్య సమన్వయం అవసరమని, పోలీసులు, వైద్యులు సమిష్టి కృషితో సమాజంలో ప్రజల ప్రాణాలకు భద్రత కలిగించే విధంగా బాధ్యతగా ఉండాలని తెలిపారు.

మన పోలీస్ - మన ఊరు

సిద్దిపేట జిల్లాలో వినూత్న ప్రయోగంలో భాగంగా మన పోలీస్ – మన ఊరు అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అన్నారు. ఇందులో భాగంగా ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కో గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా, ఊరూరా సిసి కెమెరాల ఏర్పాటు, సిద్దిపేట సురక్ష నేత్రవంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్వీఎం మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ, సీఈవో శ్రీనివాసరావు, గజ్వేల్ ఏసిపి నర్సింహులు, గజ్వేల్ రూరల్ సిఐ డి.రవిరాజు, గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి, ములుగు ఎస్ఐ వి.రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

సిపి రష్మీ పెరుమాళ్ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఆర్వీఎం కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్య

గురు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

చౌటకూరు, మార్చి 31, ప్రభాతవార్త: మండల పరిధిలోని సరాఫ్పల్లి గ్రామశివారులో 161వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతి చెందినట్లు పుల్కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... మండలంలోని కోర్పోలు గ్రామానికి చెందిన కోరుబోయిన ఉదయ్కిరణ్(25) రాత్రి కోర్పోలు నుంచి మోటారు బైక్(ఏపీ 29 బీఎఫ్ 4197)పై చౌటకూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి కోరుబోయిన నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్తో వ్యక్తికి తీవ్ర గాయాల

పాపన్నపేట, మార్చి 31 (ప్రభాతవార్త): కొడుపాక లైన్మెన్ విధులలో నిరక్ష్యం వహించడంతో ఒక అమాయకుడు విద్యుత్షాక్కు గురై విద్యుత్ స్తంభంపై నుండి కిందపడి తీవ్ర గాయాలైనట్లు మాజీ సర్పంచ్ భూమయ్య ఆరోపించారు. మంగళవారం గ్రామానికి చెందిన మహేష్ ఎల్సి తీసుకొని అమర్ అనే వ్యక్తిని విద్యుత్ స్తంభం ఎక్కించారని చెప్పారు. అయితే ఎల్సి ఇవ్వక ముందే సబ్స్టేషన్లో ఒక వ్యక్తి విద్యుత్ సరఫరాకు లైన్ ఆన్ చేశాడన్నారు. దీంతో విద్యుత్ స్తంభంపై పనులు చేపడుతున్న అమర్ షాక్కు గురై కిందపడడంతో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. కాగా విధులు నిర్వర్తించాల్సిన జెఎల్ఎం గోపాల్ సక్రమంగా విధులు నిర్వర్తించకుండా బినామీ ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని ప్రమాదకర పనులు చేయిస్తున్నాడని ఆరోపించారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్లో కొంత మంది ప్రైవేటు వ్యక్తులతో మద్యం తాగుతున్నాడని ఆరోపించారు. మద్యం తాగి విధులు చేపట్టడమే నేరమైతే ఎల్సిలు ఇవ్వడం, మరిచి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయడం సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, విధులను నిర్లక్ష్యం జేసిన ఎల్ఎం గోపాల్పై విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన

మర్కుక్, మార్చి 31 (ప్రభాతవార్త): ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలంటే రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్ఐ దామోదర్ సూచించారు. మంగళవారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మర్కుక్ పోలీస్స్టేషన్ పరిధిలోని కావేరి కంపెనీ కార్మికులకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డుప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నియమాలు ప్రతిఒక్కరూ పాటించడం అత్యంత అవసరమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్బెల్ట్ ధరించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా కంపెనీలలో పనిచేసే కార్మికులు ఉదయం, రాత్రి షిఫ్ట్లకు వెళ్ళే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ పోలీస్ సిబ్బంది, కంపెనీ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లను తొలగించిన ఆరుగురిపై కేసు నమోదు

న్యాల్కల్, మార్చి 31, ప్రభాతవార్త: నీమ్జ్ పరిధిలోని భూముల సరిహద్దుల వద్ద అమర్చి బంద్ రాళ్లను తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... నీమ్జ్ పరిధిలోని రుక్మాపూర్, ముంగ తండా శివారులోని సర్వే నంబర్ 48/2, 48/12, 49, 148 పరిధిలో ఉన్న నీమ్జ్కు సంబంధించిన భూములకు అమర్చిన బౌండరీ రాళ్ల (బాండ్ రాళ్లను) రుక్మాపూర్ తండాకు చెందిన చౌహాన్ శంకర్, రాజు, పుండలిక్, నారాయణ, ముంగి తండాకు చెందిన బొజ్జ నాయక్, బర్దీపూర్ గ్రామానికి చెందిన తెలుగు శ్రీకాంత్ తొలగించారన్నారు. నీమ్జ్ భూముల సర్వే సమయంలో సైతం న్యూసెన్స్ క్రియేట్ చేశారని మండల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.

గుంతపల్లి గ్రామంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

కొండాపూర్, మార్చి 31 (ప్రభాతవార్త):

కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇళ్లపై సమగ్ర పరిశీలన నిర్వహించారు. మొదట గ్రామం లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదుల పరిస్థితి, పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాలపరిసరాలు, కాంపౌండ్వాల్వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యా ర్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగుందని విద్యార్థులు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని, ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తదుపరి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ వంటగది, పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు గుడ్డు, ఇతర పౌష్టికాహారం అందుతున్నదా అని ఆరా తీశారు. చిన్నారుల శారీరక, మానసిక అభి వృద్ధికి పౌష్టికాహారం ముఖ్యమని పేర్కొంటూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సరైన మోతాదులో పోషకాహారం అందించాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు తాగునీరు, చల్లని వాతావరణం కల్పించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదే శించారు. అనంతరం మోనిన్ పరిశ్రమను సందర్శించిన కలెక్టర్ పరిశ్రమలో అమలవుతున్న భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు.

పాఠశాల, అంగన్వాడీ ఇందిరమ్మ ఇళ్లపై సమగ్ర పరిశీలన



పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తదితరులు

ఇద్దరు మహిళల అదృశ్యం

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త: ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన పట్టణంలోని టీచర్స్ కాలనీ, వెంకటరమణ కాలనీలలో చోటు చేసుకుంది. ఎస్ఐ వినయ్కుమార్ కథనం ప్రకారం... పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన సంద్ర జైపాల్ రెండవ కుమార్తె ప్రైవేటు స్కూల్లో టీచర్ యస్ జాయిసి(24) ఈ నెల 28న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి రోజు మాదిరిగా పాఠశాలకు విధులు నిర్వహించేందుకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదన్నారు. జాయిసి ఆచూకి కోసం కుటుంబ సభ్యులు బంధువులు, సన్నిహితులవద్ద ఆచూకి కోసం గాలించినా ఫలితం లేకపోయిందన్నారు. అదృశ్యమైన జాయిసి తండ్రి జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వెంకట రమణ కాలనీలో...

పట్టణంలోని వెంకటరమణణ కాలనీకి చెందిన మాలిపటేల్ సిద్దారెడ్డి భార్య పటేల్ కవిత మార్చి 27న అదృశ్యమైనట్లు ఎస్ఐ వినయ్కుమార్ పేర్కొన్నారు. 27వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో భార్య ఇంట్లో నుంచి 3 లక్షల రూపాయలను తీసుకుని వెళ్లిపోయిందన్నారు. ఇంట్లో నుంచి వెళ్లిన పటేల్ కవితి తిరిగి రాకపోవడంతో బంధువులు, సన్నిహితుల వద్ద ఆచూకి కోసం గాలించిన ప్రయోజనం లేకపోవడంతో కవిత భర్త సిద్దారెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్కుమార్ వివరించారు.

ఘనంగా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాలు

-కన్నులపండువగా ఎల్లమ్మ కళ్యాణం.. బోనాల ఊరేగింపు

అమ్మవారికి ప్రత్యేకపూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సునీతారెడ్డి కాలనీలో 2వ వార్డు 12 వార్డులలో వెలిసిన శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా 2వ వార్డు కౌన్సిలర్ అంతారం సుధీర్‌గౌడ్, 12వ వార్డు కౌన్సిలర్ సమీనా షేక్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లికి ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎల్లమ్మతల్లి జమదగ్నిల కళ్యాణ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అదేవిధంగా సాయంత్రం ఆలయంలోని రేణుక ఎల్లమ్మతల్లికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ ఉత్సవానికి స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్, వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్‌లు వేరు వేరుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిరంజన్‌దాస్, చింతకుంట శ్రీకాంత్, నాయకులు జగదీష్, ఇలియాజ్, మోహిజొద్దీన్, కండెల రాజు, రవి, నాయకులు సత్యంగౌడ్, పంబళ్ళ బిక్షపతి, బాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌గుప్త, రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, సుధీర్ గౌడ్, సూరారం నర్సింలు, సూరి, సుభాష్‌గౌడ్, మహ్మద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట, మార్చి 31, ప్రభాతవార్త:
కుల, మత భేదాలు తగవని ప్రజలందరూ సమానమని చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని అంబాజీపేటలో పౌరహక్కులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రజలంతా సామరస్యంగా కలిసిమెలసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి సబితా, రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వృద్ధులను పరామర్శించిన జిల్లా ఎస్పీ

-కేసు విషయంలో సహకరించిన గ్రామస్థులకు సన్మానం

కేసు విషయంలో సహకరించిన గ్రామస్థులను సన్మానించిన ఎస్పీ

చిన్నశంకరంపేట, మార్చి 31, ప్రభాతవార్త:
సమాజంలో నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం పోలీస్ వ్యవస్థకు ఎంతో అవసరమని మెదక్ జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాసరావు అన్నారు. చిన్నశంకరంపేట మండలపరిధి జంగరాయిలో ఇటీవల గుర్తుతెలియని దుండగుడు వృద్ధదంపతులైన సావిత్రి, అంజయ్యలపై దాడిచేసి బంగారాన్ని ఎత్తుకెళ్లగా, 48గంటల్లో నిందితుడిని పట్టుకొని బంగారాన్ని స్వాధీనం చేసుకొని దుండగుడిని అరెస్టుచేసిన విషయం పాఠకులకు విదితమే. కాగా ఆసుపత్రి నుండి ఇంటికివచ్చిన వృద్ధదంపతులను ఎస్పీ డివి.శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించి, పోలీసులు అండగా ఉంటారని వారికి ధైర్యం చెప్పారు. ప్రజారక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ కృషిచేస్తారని తెలిపారు. కేసును ఛేదించడంలో కృషిచేసిన పోలీసులను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. స్వయంగా ఎస్పీ గ్రామానికివచ్చి వృద్ధులను పరామర్శించడంపట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. నిందితుడిని పట్టుకోవడానికి సహకరించిన గ్రామస్థులకు ఎస్పీ డివి.శ్రీనివాసరావు శాలువాకప్పి సన్మానించారు. అనుమానిత వ్యక్తులపట్ల కచ్చితంగా వారివివరాలను ఆరా తీయాలన్నారు. అనుమానితులపట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పీ నరేందర్‌గౌడ్, సిఐలు వెంకటరాజాగౌడ్, సందీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణగౌడ్‌లు ఉన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

-ఎస్ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట, మార్చి 31, ప్రభాతవార్త:
క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ నారాయణగౌడ్ హెచ్చరించారు. మంగళవారం చిన్నశంకరంపేటలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ప్రారంభమైన నేపథ్యంలో యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. బెటింగ్‌మాయలోపడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని హితవుపలికారు. బెట్టింగ్ ఉచ్చులో పడొద్దని యువతకు సూచించారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

మహాలక్ష్మి పథకం విజయోత్సవాలు

బేగంబజార్, మార్చి 31, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న మహాలక్ష్మిపథకం విజయోత్సవాలను మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మహిళలు ఈపథకం ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని, ప్రయాణ ఖర్చులో ఆదా అయ్యే మొత్తాన్ని తమ కుటుంబాల సంక్షేమం, మెరుగైన జీవన విధానానికి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్‌ఆర్‌టిసి సేవలనువినియోగిస్తున్న ఐదుగురు మహిళాప్రయాణికులను సత్కరించి శాలువకప్పి జ్ఞాపికలను అందచేశారు. ఈకార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హెచ్‌జెడ్)కు ఖ్రోషాఖాన్, రీజినల్ మేనేజర్ (ఆర్‌ఆర్) శ్రీలత, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెయింటెన్స్) సుగుణాకర్, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్) సరస్వతి తదితరులు పాల్గొన్నారు. కాగా బి.రమేశ్వరి సూపరిండెంట్ హెల్త్ డిపార్ట్‌మెంట్, పి.నీలిమ ఎ.ఎన్.ఎం హెల్త్ డిపార్ట్‌మెంట్, ప్రైవేట్ ఉద్యోగి ఎం.మౌనిక, ఆశావర్కర్ ఎస్.అరుణ, విద్యార్థిని కుమారి జోష్నాలను సన్మానించారు.

స్వచ్ఛంద సంస్థలు రక్తదానం కోసం ముందుకు రావాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 31, ప్రభాతవార్త:
ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకుగాను యువతీ యువకులతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, దంతకళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్.యాదవ్‌లు అన్నారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రి, దంత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు, దంత కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్. యాదవ్ కూడా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల ఆర్.ఎం.ఓ వైద్యులు జగదీష్, జయకృష్ణ, ఉమాదేవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు గురించి మాట్లాడేముందు నీస్థాయి తెలుసుకో!

-పదవులు, టిక్కెట్లు అమ్ముకునే నీచచరిత్ర నీది
-జిల్లా మంత్రి ఒత్తిడితోనే మామీద అక్రమ మైనింగ్‌కేసు
-ఒక గజం భూమి కబ్జా అని నిరూపిస్తే ఏశిక్షకైనా సిద్ధమే
-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఫైర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 31, ప్రభాతవార్త:
తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన మాజీమంత్రి హరీష్‌రావుపై, మూడుసార్లు ప్రజల మద్దతుతో గెలిచిన నామీద మాట్లాడే స్థాయి కాట శ్రీనివాస్‌గౌడ్‌కు లేదని, ఇప్పటికైనా స్థాయి తెలుసుకొని మాట్లాడాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఇటీవల మాజీమంత్రి హరీష్‌రావు పైన, తన పైన వ్యక్తిగతంగా చేసిన ఆరోపణలు ఖండిస్తూ మంగళవారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ రెండుసార్లు పటాన్‌చెరు నుండి ఎమ్మెల్యేటికెట్ ఇచ్చినా చిత్తుగా ఓడిన కాట శ్రీనివాస్‌గౌడ్ ఈరోజు మాజీమంత్రి హరీష్‌రావుపై, మూడుసార్లు ప్రజల మద్దతుతో గెలిచిన నాపై ఆరోపణలుచేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీని ఓడించి ప్రజలు చెంపదెబ్బ కొట్టినట్టు గుణపాఠం చెప్పినా, కాట తీరులో మార్పురాకపోవడం సిగ్గుచేటు అన్నారు. జిల్లామంత్రి దామోదర రాజనర్సింహ కూతురు పెళ్లికి బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేయడం నిజంకాదా అని ప్రశ్నించారు. జిల్లా మంత్రి దామోదర ఒత్తిడితోనే అధికారులను పావులుగా వాడుకొని తన సోదరుడిని అక్రమ మైనింగ్ కేసులో ఇరికించారని ఆరోపించారు.

కోర్ట్ ఆదేశించినా, రీసర్వే చేయట్లేదు...
2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పటాన్‌చెరు రెవెన్యూ పరిధిలోని లక్డారంలో సర్వేనెంబర్ 738లో 15ఎకరాల భూమిని క్రషర్‌కోసం కేటాయించారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అప్పటికే ఆ భూముల్లో ప్రోగ్రెసివ్ కన్స్ట్రక్షన్ జాతీయ రహదారికి సంబంధించి కంకర మైనింగ్ నిర్వహించారని అదే స్థలాన్ని తమ సంతోష్ శాండ్ కంపెనీకి మైనింగ్‌కి కేటాయించగా మేము అక్కడ క్రషర్ వ్యాపారం నిర్వహించామన్నారు. అయితే అప్పటికే ప్రోగ్రెస్ కంపెనీ మైనింగ్ నిర్వహించిన వాటా తేల్చకుండానే తమపై మంత్రి దామోదర కక్ష కట్టి రాత్రికిరాత్రే 11 తప్పుడుకేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 38కోట్ల అక్రమ మైనింగ్ జరిగిందని ఆరోపిస్తూ పదిరెట్లు పెనాల్టీ వేసి 380కోట్ల రాయల్టీ చెల్లించాలని అధికారులు ఆదేశించారని తెలిపారు. తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించగా రీ సర్వే నిర్వహించి ప్రోగ్రెసివ్ కన్స్ట్రక్షన్ కంపెనీచేసిన మైనింగ్‌లెక్క తేల్చాలని కోర్టు ఆదేశించినా, అధికారులపై ఒత్తిడితెచ్చి సర్వే నిర్వహించకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

భూకబ్జా ఆరోపణలు వట్టివే...
పోచారం సర్వేనెంబర్ 62లో తమ కుటుంబ సభ్యులు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి విక్రయించారన్న ఆరోపణలు అబద్ధమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో కాట నిజానిజాలు నిర్ధారించకుండా ఆరోపణలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఒక గజం స్థలం నేను కబ్జా చేశానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని స్పష్టంచేశారు.

కుటుంబానికి న్యాయంచేయని నువ్వా మాట్లాడేది..
సొంత కుటుంబ సభ్యులను మోసం చేసిన కాట శ్రీనివాస్‌గౌడ్ మాగురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సొంత తల్లికి తిండి పెట్టకుండా, తోడబుట్టిన తోబుట్టువులను, అన్నా వదినలను మోసంచేస్తే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పంచాయతీ పెట్టుకునే కాట, ప్రజలకు సేవ చేస్తానని డైలాగులుకొట్టడం హాస్యాస్పదమన్నారు.

ఈ సమావేశంలో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, జడ్పి మాజీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీచైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీకార్పొరేటర్లు సపనదేవ్, శంకర్ యాదవ్, మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జడ్పిటిసి కొలన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు యాదగిరి యాదవ్, దేవానంద్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

-ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి

పౌరహక్కులదినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలపరిధిలోని ఆవంచ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రంజిత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అస్పృశ్యత నివారణ నివారణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాజపేట స్రవంతికరుణాకర్, ఆర్ఐ ప్రభాకర్, పంచాయతీకార్యదర్శి మల్లేశం, వార్డుసభ్యులు కరీముద్దీన్, సాలం గ్రామస్థులు పాల్గొన్నారు.

బెయర్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

నర్సాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండలపరిధిలోని ఆవంచగ్రామంలో బెయర్ కంపెనీ ఆధ్వర్యంలో వివిధగ్రామాల ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బెయర్ కంపెనీ టీ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి వరి, ఇతర పంటలపై వచ్చే వివిధరకాల చీడపీడలు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి స్రవంతికరుణాకర్, రైతులు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కంపెనీ ప్రతినిధులు అభిషేక్, కరుణాకర్, స్థానిక డీలర్ కుమ్మరి రమేష్, రైతులు పాల్గొన్నారు.

మాసాయిపేట రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవం

-పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి

రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవంలో పాల్గొన్న సుహాసినిరెడ్డి

వెల్దుర్తి, మార్చి 31, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన మాసాయిపేటలో మంగళవారం గ్రామ గౌడ కులస్థులు రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధికారప్రతినిధి గంగాధర్, స్థానిక మాజీసర్పంచి మధుసూదన్‌రెడ్డిలతో పాటు నాయకులు, గౌడ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటమార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు

నర్సాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో రైతులకు పంటమార్పిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మండలాధికారిణి దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్, రూతు, తేజస్విని, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వెల్దుర్తి ప్రభుత్వ పిహెచ్‌సిలో హెల్త్ క్యాంప్



వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది

వెల్దుర్తి, మార్చి 31, ప్రభాతవార్త:
వెల్దుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉచిత వైద్యశిబిరం గ్రామ సర్పంచి ఆదర్శ్, ఉపసర్పంచి శ్రవణ్‌కుమార్‌లు ప్రారంభించారు. ప్రత్యేక వైద్య బృందం ఉచిత వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీచేశారు. ప్రజలకు అన్నిపరీక్షలు డాక్టర్ శిరీష, సౌజన్య, వైద్యబృందం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలరాంరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

12వ వార్డులో బోరు పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

గుమ్మడిదల, మార్చి 31, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతనబోరు ఏర్పాటుకు శంకుస్థాపనచేశారు. వార్డు కౌన్సిలర్ ఆకుల మాధవిసత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్‌చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, కమిషనర్ దశరథ్ కలిసి బోరు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డు ప్రజలకు తాగునీటి ఇబ్బందులులేకుండా ఉండేలా అవసరమైనచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపాలిటీపరిధిలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యగోవర్ధన్‌రెడ్డి, వార్డుకౌన్సిలర్లు మురళి, కిషన్, నరేందర్‌రెడ్డి, ప్రమీల, రాజిరెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, ఆంజనేయులుయాదవ్, అధికారులు, కాలనీవాసులు, వివిధపార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసి ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం వేడుకలు

ప్రయాణికులను సన్మానిస్తున్న డాక్టర్ సుమాన్, ఆర్టీసి డిఎం స్వామి

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
రాష్ట్రంలోని రవాణాసంస్థలో అమలవుతున్న మహాలక్ష్మిపథకం విజయవంతంగా కొనసాగుతుండటంతో మంగళవారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో డిఎం టి.స్వామి ఆధ్వర్యంలో 10వేలకోట్ల ఆదా అనే మహాలక్ష్మి వేడుకలను ప్రయాణికులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా ఆసుపత్రి చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుమాన్ హాజరై మహిళా ప్రయాణికులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ టి.స్వామి మట్లాడుతూ మహాలక్ష్మిపథకంతో 9 డిసెంబరు, 2023న పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో తెలంగాణవ్యాప్తంగా మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం దక్కిందన్నారు. 28 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లమంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారన్నారు. జహీరాబాద్‌డిపో పరిధిలో 81 కోట్ల రూపాయలను మహిళలు ఆదా చేసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మహిళాసమాఖ్య అధ్యక్షులు అరుణ, అకౌంటెంట్ ఈశ్వరమ్మ, అసిస్టెంట్ మేనేజర్ శ్వేత, గ్యారేజ్ సూపర్‌వైజర్ తిరుమలేష్, మహిళా ప్రయాణికులు పాల్గొన్నారు.

జిన్నారం పురపాలకానికి రూ.15.96 కోట్ల బడ్జెట్

-కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

జిన్నారం, మార్చి 31, ప్రభాతవార్త:
జిన్నారం పురపాలక సంఘం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 15.96కోట్ల వ్యయ అంచనాతో రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చైర్మన్ జనార్ధన్ అధ్యక్షతన, కమిషనర్ తిరుపతి సమక్షంలో బడ్జెట్‌ను ఖరారు చేశారు. పురపాలక సొంతవనరుల ద్వారా రూ.3.04 కోట్లు సమకూరనుండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ. 12.92 కోట్లు అందనున్నట్లు వెల్లడించారు. సిబ్బంది వేతనాలకు రూ.98 లక్షలు, పచ్చదనం పెంపుకు రూ.30 లక్షలు, పరిశుభ్రత, నిర్వహణకు రూ.26 లక్షలు, తాగునీటి పనులకు రూ.15 లక్షలు కేటాయించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పిఆర్ డిప్యూటీ ఈఈకి ఘనంగా వీడ్కోలు

పిఆర్ డిప్యూటీ ఈఈకి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

అల్లాదుర్గం, మార్చి 31, ప్రభాతవార్త:
పంచాయతీరాజ్ శాఖలో డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ప్రభాకర్‌కు పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలుపలికారు. పలుశాఖల అధికారులు ప్రభాకర్‌ను శాలువాలు కప్పి, గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, ఏఈ రమేష్, విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, గజ్జాడ కిషన్, పిరియానాయక్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, శేఖర్, ఉపాధ్యక్షులు సాయిబాబా, చిల్వర్ సర్పంచి శశిధర్‌రెడ్డి, శ్రీశైలం, శంకర్ నాయక్, నాయకులు ప్రభు, సురేష్, శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వయోవృద్ధులకు ఉచిత ఆరోగ్యవైద్య శిబిరం

జూబ్లీహిల్స్, మార్చి 31, ప్రభాతవార్తః
నిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వయోవృద్ధులకు మంగళవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హెల్త్ మిషన్-100 కార్యక్రమంలో భాగంగా ఈ సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటుచేశారు. నిమ్స్ జెరియాట్రిక్ మెడిసిన్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో, ఆసుపత్రి పరిపాలనా విభాగం సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. దాదాపు 100మంది వయోవృద్ధులకు ఇక్కడ ఉచితఆరోగ్యపరీక్షలను నిర్వహించారు. వారికి రక్తపరీక్షలతోపాటు ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైనవారికి మందులను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ వృద్ధులలో వ్యాధులను ముందస్తుదశలోనే గుర్తిస్తే సరైనచికిత్స అందించడానికి ఎంతో ఉపయోగం అన్నారు. భవిష్యత్తులో నిమ్స్ ఆసుపత్రి ద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ప్రొఫెసర్ వై. సత్యనారాయణ మాట్లాడుతూ.. వయో వృద్ధులకు ఈ ఉచిత పరీక్షల ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు.

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ...
నిమ్స్ ఆసుపత్రిలో పలువురు ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ చేశారు. సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ ఎం.హిమబిందు, నర్సింగ్ ఆఫీసర్ సరోజాదేవి నీలా, సివిల్ గ్రేడ్1 హరిచంద్రప్రసాద్ పదవీ విరమణ పొందినవారిలో ఉన్నారు. వీరిని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్ ఘనంగా సత్కరించా రు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ దయాకర్, డాక్టర్ మార్తరమేష్, హెచ్‌ఆర్‌డి స్టాఫ్ ఏఎన్ జ్యోతి శైలజ, వివిధ ఉద్యోగసంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : సుధాకర్ గాండే

అడ్డగుట్ట, మార్చి 31, ప్రభాతవార్త: విద్యావంతులైన పట్టభద్రులు ఐఏఎస్, ఐపిఎస్, ఐఐటీ వంటి డిగ్రీలు పొంది దేశాన్ని ప్రపంచశక్తిగా నిలబెట్టేందుకు భాగస్వాములుకావాలని ప్రముఖ పారిశ్రామికవేత్త సుధాకర్ గాండే పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ, పిజీ కళాశాలలో 2023-25 విద్యాసంవత్సరంలో ఎంబిఏ పూర్తి చేసుకున్న 115మంది విద్యార్థులకు సర్టిఫికెట్‌ల పంపిణీ స్నాతకోత్సవవేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యావంతులైన యువతీయువకులు ప్రముఖ పారిశ్రామికవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. మహిళాపట్టభద్రులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రాజశ్రీ, ఎంబిఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ నీల గొల్లపూడి ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు కళాశాల కార్యదర్శి మహ్మద్ ఫహిముద్దీన్, సంయుక్త కార్యదర్శి జిఎం.రమేష్, కోశాధికారి డి.సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంబిఏ పూర్తిచేసుకున్న పట్టభద్రులకు సర్టిఫికెట్లను సుధాకర్‌గాండే చేతులమీదుగా అందజేశారు.

ప్రజల్లో ఉండేవారికే ప్రజాదరణ ఎక్కువ

-ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

యూసుఫ్‌గూడ మార్చి 31 ప్రభాతవార్త :
అనునిత్యం ప్రజాసమస్యలకోసం పాటుపడే నాయకులకు, కార్యకర్తలకు ప్రజల్లో ఎప్పుడూ ఆధారాభిమానాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా గెలుపొందిన రాజుయాదవ్ మర్యాదపూర్వకంగా మంగళవారం వెళ్లి స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణారావును కలిశారు. అందుకు ఆయన రాజుయాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. బస్తీలో ఎలాంటిసమస్యలు ఉన్నా తమదృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్వత్‌నగర్ మాజీ అధ్యక్షులు జాహేద్ షరీఫ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజు, దస్తగిర్, ప్రకాష్ పాల్గొన్నారు.

'మెగా గ్లోబల్ సమ్మిట్-అట్లెగ్-2026'

సైఫాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
ది గ్లోబల్ అకాడమీ ఆఫ్ లా-టెక్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (గాల్టర్) ఆధ్వర్యంలో హైదరాబాగ్‌నగర చరిత్రలో తొలిసారిగా ఏప్రిల్ 3వతేదీ నుంచి 5వతేదీవరకు బేగంపేటలోని టూరిజం ప్లాజాలో 'మెగా గ్లోబల్ సమ్మిట్-అట్లెగ్-2026' నిర్వహిస్తున్నామని గాల్టర్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ డా.బండారి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన మీడియాసమావేశంలో ఆయన ఈసమ్మిట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈసమ్మిట్‌లో అమెరికా, యూకె, జపాన్, జర్మనీ, ఇటలీ తదితరదేశాలకు చెందిన అనేకమంది నిపుణులు 200మందికిపైగా పాల్గొంటారని ఆయన చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాప్రైవసీ, బ్లాక్‌చెయిన్ వంటి అధునిక సాంకేతిక అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. ఈసమ్మిట్‌లో ముఖ్యఅతిథులుగా సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ న్యాయవాదులు, అంతర్జాతీయ నిపుణులు పాల్గొని కీలక అంశాలపై సూచనలు చేస్తారన్నారు.

శక్కర్‌గంజ్‌లో హనుమ జన్మదినోత్సవం

చాంద్రాయణగుట్ట, మార్చి 31, ప్రభాతవార్త: పాతబస్తీ శక్కర్‌గంజ్ శ్రీదాసఆంజనేయ స్వామి దేవాలయంలో ఏప్రిల్ 2వతేదీ గురువారం హనుమ జన్మదినోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె.రవిరాజ్ తెలిపారు. ఆలయ అర్చక స్వాములచే ఉదయం 5.30 గంటలకు స్వామివారికి అభిషేకం, సింధూరం, ఆకుపూజ, వడమాలధారణ, ఉదయం 11గంటలకు మహానైవేద్యం సమ ర్పణ ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆ అంజనీ పుత్రుని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, SANGAREDDY AT SANGAREDDY
O.S.NO. 37 OF 2026

Between:
1) Smt. Aenugula Aruna, W/o Late Aenugula Venkat Reddy, Aged 41 yrs, Occ: Household,
2) Aenugula Harshavardhan Reddy, S/o Late A.Venkat Reddy, Aged 21 yrs, Occ: Student,
3) Aenugula Sai Kiran Reddy, S/o Late A. Venkat Reddy, Aged 16 yrs, Occ: Student,
4) Smt. Aenugula Narsamma, W/o Late A. Penta Reddy, Aged 79 yrs, Occ: Household,
All are R/o H.No. 15-40, Ishkabai, Beeramguda, Ameenpur mandal, Sanga Reddy District ...Plaintiffs
AND
1) The Tahasildar, Ameenpur Mandal, Sanga Reddy Dist.
2) The Tahasildar, Chilpched Mandal, Medak Dist.
3) The Tahasildar, Mominpet Mandal, Vikarabad Dist.
4) All concerned ...Defendants
To,
ALL CONCERNED
The plaintiffs have filed suit for Declaration to declare the plaintiffs are the legal heirs of the deceased Late Aenugula Venkat Reddy, hence you have to appear before the court on 15/04/26 at 10:30 AM., for your appearance, otherwise matter will be decided as per law.
(BY THE ORDER OF THE COURT)
G.L. Sreenivasa Rao
D. Vishal
Advocates
Beeramguda, Sangareddy District
Cell No. 8247295139

మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలి

-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 31 (ప్రభాతవార్త): గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లో నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సిఎం కెసిఆర్ గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తూప్రాన్ బస్టాండ్‌ల ఆధునీకరణ, నిర్మాణాల కోసం నిధులను మంజూరు చేయడం జరిగిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయకుండా తాత్సారం చేస్తోందని ఆరోపించారు. పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రయాణీకులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. రాజకీయాలకతీతంగా ప్రజా అవసరాలను గుర్తించి వెంటనే నిధులు విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన బస్టాండ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, స్థానిక కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త విభజనపై అవగాహన

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మికొమురయ్య

హుస్నాబాద్ రూరల్, మార్చి 31, ప్రభాతవార్త : పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య అధ్యక్షతన 11వ వార్డులో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. అలాగే ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పద్మ, వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, వార్డ్ ఆఫీసర్ శారద, ఆషా వర్కర్, ఆర్పీ స్వర్ణలత, జవాన్ ప్రభాకర్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ

మాట్లాడుతున్న డిపో మేనేజరు వెంకన్న

హుస్నాబాద్ రూరల్, మార్చి 31, ప్రభాతవార్త : హుస్నాబాద్ బస్ డిపోలో ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సహచర ఉద్యోగులు శాలువాలతో సన్మానించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగి ఆరె వెంకన్న మాట్లాడుతూ తాను 1992లో కండక్టర్‌గా ఆర్టీసీలో చేరి వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించానని, 14 సంవత్సరాలు కండక్టర్‌గా పనిచేసిన అనంతరం 2012లో ప్రమోషన్‌పై ఏడీసీగా నియామకం పొందినట్లు చెప్పారు. మొత్తంగా 34 సంవత్సరాల పాటు ఆర్టీసీలో సేవలందించడం ఆనందంగా ఉందని, తన ఉద్యోగ జీవితంలో సహచరులు అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల శేష జీవితం సుఖసంతోషాలతో ఉండాలి: డిఎం

పదవీ విరమణ పొందిన ఉద్యోగుల శేష జీవితం బాగుండాలని డిపో మేనేజర్ వెంకన్న ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం వారి శేషజీవితం కుటుంబసభ్యులతో ఆనందంగా గడవాలని ఆకాంక్షించారు. అలాగే వారికి రావలసిన పెన్షన్, ఇతర బకాయిలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు,రిటైర్డ్ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులతో పాటు జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇంచార్జీ ఆరె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సహాయం

గజ్వేల్ టౌన్, మార్చి 31 (ప్రభాతవార్త): గజ్వేల్ మండల పరిధిలోని కొండకండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రుషిక ఆదివారం మల్లన్నసాగర్ కెనాల్‌లో పడి మృతిచెందిన విషయం తెలిసిందే. విద్యార్థిని రుషిక చదువుతున్న గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఉపాధ్యాయులు మంగళవారం విద్యార్థిని కుటుంబసభ్యులను పరామర్శించి రూ.18వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యంను అందజేశారు.

ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీని తనిఖీ చేసిన డిఇఒ

కొండపాక, మార్చి 31, ప్రభాతవార్త : జాతీయ స్థాయిలో జరుగుతున్న ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీలో భాగంగా కొండపాక మండలం సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న తరగతులను మంగళవారం జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఒ పురుమండ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఈఒ మాట్లాడుతూ జిల్లాలో 7 పాఠశాలలు మాత్రమే పౌండేషనల్ లెర్నింగ్ స్టడీకి ఎన్నిక కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మూడవ తరగతి విద్యార్థులకు ఎన్ఈఆర్‌టి ద్వారా గుర్తించబడిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ స్టడీని నిర్వహిస్తారని తెలిపారు. ఎన్‌సిఈఆర్‌టి సూచనల మేరకు ఎఫ్ఎల్ఎస్ నిబంధనలను అనుసరించి విద్యార్థులను ఎన్నుకుంటారని, మొత్తం 12 మంది విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్ భాషలో ఒక్కో విద్యార్థికి ఒక గంట స్టడీ జరుగుతుందన్నారు. ఎన్‌సిఈఆర్‌టి వారిచే ఇవ్వబడిన ప్రత్యేకమైన టాబ్‌లెట్ పిసిలో ప్రత్యేకమైన అప్లఒ నిర్వహిస్తారన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఇట్టి స్టడీకి సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొనడం సంతోసంగా ఉందన్నారు. విద్యార్థుల ప్రతిభకు ఇది సరైన గుర్తింపన్నారు.పాఠశాల ఉపాధ్యాయుల బృందంతో మాట్లాడుతూ విద్యాసంవత్సరం ముగుస్తున్నందున రాబోయే పరీక్షలకు పిల్లల్ని మరింత సిద్ధం చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు మరింత ఉత్సహంగా పని చేయాలని అయన పలు సూచనలు చేశారు.

లెర్నింగ్ స్టడీ తరగతులను పరిశీలిస్తున డీఈఒ

హుస్నాబాద్‌లో మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న దృశ్యం

గజ్వేల్‌లో మహిళా ప్రయాణీకులను సన్మానిస్తున్న దృశ్యం

‘మహాలక్ష్మి’ని వినియోగించుకున్న మహిళలకు సన్మానం

సిద్దిపేట ప్రభాతవార్తప్రతినిధి,/హుస్నాబాద్ రూరల్

సిద్దిపేటలోని మోడ్రన్ బస్టాండ్‌తోపాటు హుస్నాబాద్ బస్టాండ్‌లలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం సిద్దిపేటలో డిపో మేనేజర్ డి.భవభూతి, హుస్నాబాద్‌లో డిఎం వెంకన్న ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా తెలంగాణ డెంటల్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ స్పందన హాజరు కాగా హుస్నాబాద్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద సిద్దిపేట జిల్లాలో 8 కోట్ల 66 లక్షల మంది మహిళలు ప్రయాణించి రూ.33 కోట్ల 89 లక్షల రూపాయలు ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పథకం పేద,బడుగు, బలహీన వర్గాల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని చెప్పారు. ముఖ్యఅతిథి డాక్టర్ స్పందన, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మిల మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా అవసరమైనప్పుడు ఆసుపత్రులకువెళ్లి చికిత్స పొందే అవకాశం కల్పించబడిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ మహాలక్ష్మి పథకాన్ని వినియోగిస్తున్న మహిళలను డిపో మేనేజర్ శాలువా పూలమొక్కతో సన్మానించారు. సిద్దిపేట కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి. కనకలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ కేఎస్ నారాయణ, సూపర్‌వైజర్లు మోలానా, శ్రీనివాస్‌శర్మ, బాలకిషన్ తో పాటు ప్రయాణికులు పెద్దఎత్తున పాల్గొనగా హుస్నాబాద్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవిందర్, మున్సిపల్ విప్ కేశవేణి రమేష్, కౌన్సిలర్లు బూరుగు లత కిష్టస్వామి, కొండ రజిత, పూదరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్ టౌన్, మార్చి 31 (ప్రభాతవార్త): టిఎస్ఆర్‌టిసి అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో ఆర్థిక ఉపశమనం కలిగిస్తుందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పావన్ అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో మహిళా ప్రయాణీకులను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో పరిధిలో 2.76 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి రూ.104 కోట్లు ఆదా చేసుకున్నారని అన్నారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజ్ఞాపూర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శారద మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం ద్వారా వారిరోజువారీ ఖర్చులుతగ్గి, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, మెకానికల్ సూపర్వైజర్ జమీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓల్డ్ ఏజ్ హోమ్ కేంద్రాన్ని సందర్శించిన సౌజన్య

గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తనిఖీ

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి31, ప్రభాతవార్త: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర మార్గదర్శకత్వంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య మంగళవారం సంగారెడ్డిలోని గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భరోసా కేంద్రాన్ని సందర్శించే బాధితులకు తక్షణమే న్యాయపరమైన సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. పోక్సో చట్టం, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. లైంగిక నేరాలకు పాల్పడేవారిపై కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే వృద్ధులపట్ల ప్రత్యేకశ్రద్ధ చూపించి, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చే బాధితుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎవరికైనా న్యాయసంబంధిత సమస్యలు ఉన్నట్లయితే, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యాలయాన్ని సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం అధికారులు, ఓల్డ్‌ఏజ్ హోమ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులకు తక్షణ స్పందన.. సమస్య పరిష్కారం

యూసుఫ్‌గూడ మార్చి 31 ప్రభాతవార్త :

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ రోడ్డు నంబర్ 1 పరిధిలో గత కొన్ని రోజులుగా డ్రైనేజి లైన్ పొంగిపొర్లడంతో పాటు రైల్వే ట్రాక్ వెంబడి మురు గు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సమీప ఇళ్లలోని బోర్‌వెల్స్‌లో కూడా డ్రైనేజి నీరు వస్తుందని ప్రజా వాణిలో స్థానిక సంక్షేమ సంఘం తరపున ఫిర్యాదు చేయటం జరిగింది. ఈ ఫిర్యాదుకు స్పందించిన అధికార యంత్రాంగం మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీ లించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న కలుషిత నీటి సమస్యను సత్వరమే పరిష్కరించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్ గంగాధర్, డీజీఎమ్ శ్రీనాధ్‌రావు, మేనేజర్ అన్విత్‌కుమార్, వివేకానంద్‌నగర్ సంక్షే మ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయిత్రినగర్‌లో.......

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ కాలనీలో గత 15 రోజులుగా రైల్వే ట్రాక్ ప్రాంతంలో డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో స్థానికంగా కాలనీ వాసుల బోర్లలో కలుషిత నీరు రావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అప్పటి నుంచి సమస్యను పరిష్క రించాలంటూ స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, ఇతర కమిటీ సభ్యులు విషయాన్ని స్థానిక ఎమ్మె ల్యే కృష్ణారావు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అదే విధంగా డ్రైనేజీ నీరు ప్రవహించే వివేకానందనగర్ కాలనీ వాసుల దృష్టికి కూడా తీసుకు వెళ్లడం జరిగిందని అయి నా పరిష్కారం కాకపోవడంతో చివరికి ప్రజావాణిలో ఫి ర్యాదు చేశారు. దీంతో స్పందించిన సంబంధిత అధికారు లు మంగళవారం కాలనీలో పర్యటించి సమస్యను గుర్తిం చి తగిన విధంగా పనులు పూర్తి చేశారు. దీంతో స్థానికు లు హర్షం వ్యక్తం చేశారు. మరోమారు ఇలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేదు : శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త

బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేదని ఖైరతా బాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ అన్నారు.ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ,రాష్ట్ర మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు మంగళ వారం అంబర్‌పేటలోని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడు తూ బిజెపి ప్రభుత్వ పాలిత రాష్ట్రాలలో మహిళలకు ,బాలికలకు రక్షణ కరువైందన్నారు. బిజెపికి చెందిన 44 మంది ఎంపీలు,ఎమ్మెల్యేలు మహిళలపైన అత్యాచార లైంగిక వేధింపుల కేసులో ఉన్నారని ఆరోపించారు. ఈ విషయంలో బిజెపి ప్రభుత్వంలోని మహిళా మంత్రులు కూడా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె నిలదీశారు. మోదీ ప్రభుత్వ పాలనలో జరిగిన కొన్ని దాడులను గురించి ఆమె గుర్తుచేస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలపైన వెంటనే చట్టపరమైన చర్యలను తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బేటి పడావో బేటి బచావో అన్న మోదీ మీ పాలిత రాష్ట్రాలలో మహిళలకు,బాలికలకు రక్షణ ఎక్కడ ఉందని నిలదీశారు. ఇప్పటికైనా బిజెపి అగ్రనాయకత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే ముందు బాధితులకు న్యాయం చేయా ల్సిందిగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులకు న్యాయం లభించే వరకు దేశవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జీలు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుగుణరెడ్డి, స్టేట్ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బమ్మ, కార్వాన్ నియోజకవర్గం అధ్యక్షురాలు మాధవి, బ్లాక్ ప్రెసిడెంట్ వనజ, ప్రసన్న భారతి, డివిజన్ ప్రెసిడెంట్లు కవిత, అయేషా బేగం, పాల్గొన్నారు.

కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన

మర్కుక్, మార్చి 31 (ప్రభాతవార్త): ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలంటే రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్ఐ దామోదర్ సూచించారు. మంగళవారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కావేరి కంపెనీ కార్మికులకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డుప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నియమాలు ప్రతిఒక్కరూ పాటించడం అత్యంత అవసరమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా కంపెనీలలో పనిచేసే కార్మికులు ఉదయం, రాత్రి షిఫ్ట్‌లకు వెళ్ళే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ పోలీస్ సిబ్బంది, కంపెనీ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో మెగా ఉచిత వైద్య శిబిరం

బెజ్జంకి, మార్చి 31, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మెడికవర్‌హాస్పిటల్ సహకారంతో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం డాక్టర్ కొండ్ల శ్వేత విద్య ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్య సలహాలు అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సిపిఆర్‌చేసే పద్ధతిని ఎలా చేయాలో క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి ఈసీజీ పరీక్షలు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాలోత్ సంగీత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

-పిఆర్‌టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి

ఉపాధ్యాయురాలు గాయత్రిదేవిని సన్మానిస్తున్న పిఆర్‌టియు నేతలు

వర్గల్, మార్చి 31 (ప్రభాతవార్త): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పిఆర్‌టియు ముందుండి పోరాటం చేస్తుండగా, ఇప్పటికే వివిధ సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి ముందుంచినట్లు పిఆర్‌టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలం మజీద్‌పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గాయత్రిదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిఆర్‌టియు మండల శాఖ బాధ్యులు చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఐదు దశాబ్దాల సంఘ ఆవిర్భావం నుండి ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు, ఎన్నో రాయితీలు కల్పించిన ఘనత పిఆర్‌టియు సంఘానికి దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు ఒకే విడతలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సునీత, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ, మండల సంఘ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో హార్టీ ఇన్నోవేషన్ హబ్ స్థాపనకు చర్యలు

-వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

ములుగు, మార్చి 31 (ప్రభాతవార్త): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో హార్టీ ఇన్నోవేషన్ హబ్ స్థాపనకు చర్యలు చేపడుతున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి వెల్లడించారు. ఉద్యాన రంగంలో ఆధునిక సాంకేతికతలను ప్రవేశపెట్టి, పరిశోధనలను మరింత అభివృద్ధి చేయడమే ఈ హబ్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరిపాలనా కార్యాలయాన్ని ఏఎన్‌జిఆర్ఏయు మాజీ ఉపకులపతి డాక్టర్ సురవరం సుధాకర్‌రెడ్డి, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా నాచురల్ రిసోర్సెస్ డైరెక్టర్ కె.రమేష్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతో సంయుక్తంగా ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్‌లు, సహకార పరిశోధన ప్రాజెక్టులపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి దండ రాజిరెడ్డి మాట్లాడుతూ ఈ హార్టీ ఇన్నోవేషన్ హబ్ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధన అవకాశాలు కల్పించబడతాయని, విద్యార్థులు, అధ్యాపకులకు ప్రపంచ స్థాయి పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఉద్యాన రంగంలో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లు కూడా ప్రోత్సహించబడతాయని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ జె.చీనా నాయక్, యూనివర్సిటీ కన్సల్టెంట్ డాక్టర్ కె.వీరాంజనేయులు, డాక్టర్ జిపి.సునందిని, డాక్టర్ సురేష్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ ఎన్.శ్రీనివాసన్, టెక్నికల్ సెక్రటరీ డాక్టర్ పిడిగం సైదయ్య, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ వి.సుచిత్ర, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

కొమురవెల్లి గ్రామపంచాయతీలో వేలంపాట

కొమురవెల్లి, మార్చి 31, ప్రభాతవార్త : కొమురవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు అధ్యక్షతన పంచాయతీ ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో బి.లక్ష్మప్ప ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచే ఉద్దేశ్యంతో నిర్వహించిన ఈ వేలంపాటలో వాహనాల పార్కింగ్ హక్కులను శివలింగు రమేష్ రూ. 18,12,000లకు దక్కించుకున్నారు. అలాగే అంగడి (షాపుల) వేలాన్ని ఎక్కదేవి అర్జున్ రూ. 97,000లకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో ఎంపీఓ వి. శ్రీనివాస్ వర్మ, పంచాయతీ కార్యదర్శి జి. రాజు, ఉప సర్పంచ్ పి. శ్రీనివాస్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ, నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

గజ్వేల్, మార్చి 31 (ప్రభాతవార్త): గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లోగల శ్రీ ముత్యాలమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించగా గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాల నైవేద్యం సమర్పించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ అర్చకులు ఆలయ ప్రాంగణంలో హోమాలు, శాంతి పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాకని బిక్షపతి, వైస్ చైర్మన్ శివ్వని ఎల్లం, సైదమొల్ల నాగరాజు, దాకని దత్తయ్య, గుండ్ర నర్సింలు, గుండ్ర నర్సయ్య, సాయిరాములు, మల్లేశం, యాదగిరి, సల్ల శ్రీనివాస్, గజ్వేల్ సాయిలు, గుండ్ర నర్సింగరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారామచంద్ర స్వామి రథోత్సవం

బెజ్జంకి, మార్చి 31, ప్రభాతవార్త : దాచారం గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో రథోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని పూలతో అలంకరించిన రథంపై ఊరేగింపుగా గ్రామ ప్రధాన వీధులలో తీసుకువెళ్లారు. మహిళలు మంగళహారతులతో పాల్గొనగా, భక్తులు భక్తి పరవశంతో జై శ్రీరామ్ నినాదాలతో రథాన్ని లాగారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బైర మానస రాజేందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే ఈ రథోత్సవం గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

అక్కన్నపేట, మార్చి 31, ప్రభాతవార్త : మండలంలోని దుబ్బతండ గ్రామంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును మంగళవారం సర్పంచ్ గుగులోతు శీలరాజలింగం లబ్ధిదారురాలు భూక్య పద్మకు అందజేశారు. ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం రూ.14,500 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా చెక్కును అందజేసిన సర్పంచ్ మాట్లాడుతూ అవసరమైన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సింహ వాహన సేవలో లక్ష్మీనరసింహ స్వామి దర్శనం

బెజ్జంకి, మార్చి 31, ప్రభాతవార్త : మండలంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు సింహవాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మ్నరసింహస్వామిను సింహ వాహనంపై అద్భుతంగా అలంకరించి గ్రామ ప్రధాన పురవీధులగుండా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతులు పట్టి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మహిళలు మంగళహారతులతో పాల్గొనగా, భక్తుల “జై నరసింహా” నినాదాలతో ఊరేగింపు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టిం చింది. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ శోభాయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ వివిధ వాహన సేవలు నిర్వహిస్తూ స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తడిసిన మొక్కజొన్న కొనుగోలు చేయాలి: బిఆర్ఎస్

హుస్నాబాద్ రూరల్, మార్చి 31, ప్రభాతవార్త :

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా మొక్కజొన్న తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తడిసిన మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ మార్కెట్ యార్డ్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్న సింగిల్ విండో అధికారులకు రైతుల సమస్యలను తెలియజేస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కురిసిన అకాల వర్షంతో మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉంచిన మొక్కజొన్నలు తడిసిపోయాయని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన పంటను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించి దాదాపు 18 రోజులు అయినప్పటికీ ఇప్పటివరకు కేవలం నాలుగు వేల క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. కొనుగోళ్లు నెమ్మదిగా జరుగుతున్నందున రైతులు రోజులు తరబడి మార్కెట్‌యార్డ్‌లో వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దొంత బోయిన శ్రీనివాస్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, బత్తుల కొమురయ్య, బొజ్జ హరీష్, కందుకూరు సతీష్ తదితరులు మరియు రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు :ఎస్ఐ

నార్సింగి, మార్చి 31, ప్రభాతవార్త :

ఈజీగా డబ్బు సంపాదించడానికి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్సై సృజన అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని ఇది ఆర్థికంగా, సామాజికంగా జీవితాలను నాశనం చేస్తుందన్నారు.ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. శ్రమించకుండా వచ్చే నగదు వెనుక అనేక నష్టాలు దాగి ఉండడంతో పాటు కేసుల్లో నిందితులుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు.బెట్టింగ్‌లపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘాఉంచాలన్నారు. బెట్టింగ్‌లు జరిగి నట్లయితే డయల్ 100కుగానీ, పోలీస్‌స్టేషన్‌కుగానీ సమాచారం ఇవ్వాలన్నారు.

మాయమైన ఇసుక డంపులు ప్రత్యక్షం...

రామాయంపేట, మార్చి 31, ప్రభాతవార్త : పట్టణంలో మాయమైన ఇసుక డంపులు ప్రత్యక్షమైన ఘటన చర్చనీయాంశంగా మారింది. అధికారులు ఇటీవల సీజ్ చేసిన మూడు ఇసుక డంపుల్లో రెండు కుప్పలు కనిపించకుండాపోయాయి. ఇదేమిటని రెవెన్యూ శాఖ ఆరా తీయగా అప్రమత్తమైన ఇసుకాసురులు తిరిగి రాత్రికి రాత్రే తెచ్చి పోశారు. దీంతో సీజ్ చేసి మాయమైన ఇసుక ప్రత్యక్షమైన సంఘటన వినూత్న చర్చకు దారి తీసింది. అలాగే ఇంతకాలంగా చూసి చూడనట్లు వ్యవహరించిన రెవెన్యూ శాఖ ఒక్కసారిగా మెరుపు దాడులకు తెగబడగా మంగళవారం రెండు ఇసుక లారీలు ఒక ట్రాక్టర్ పట్టుబడ్డాయి.ప్రత్యక్షమైన ఇసుక కుప్పలకు మార్కింగ్‌వేసి, వీటిని స్వాధీన పరుచుకొని, కేసులు నమోదు చేసే పనిలో పడ్డారు అధికారులు.

మాయమైన చోటే ప్రత్యక్షమైన ఇసుక

మండలంలో భారీ వర్షం

సిర్గాపూర్ మండలంలో వర్షంకురుస్తున్న దృశ్యం

సిర్గాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
మండలంలోని ఆయాగ్రామాల్లో మంగళవారం తెల్లవారుఝాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఎండవేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందినా, రైతులకు అపారనష్టం కల్గించింది. ఉదయం విధులకువెళ్లే ఉద్యోగులు, కార్మికులు, ద్విచక్రవాహనచోదకులు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

పేట నూతన తహసీల్దారుకు సన్మానం

సన్మానిస్తున్న మంజీర రైతుసమాఖ్య అధ్యక్షుడు పృథ్వీరాజ్

సదాశివపేట, మార్చి 31, ప్రభాతవార్త:
మంగళవారం సదాశివపేటలో తెలంగాణా మంజీర రైతుసమాఖ్య తరపున నూతనంగా వచ్చిన తహసీల్దార్ చంద్రశేఖర్‌కు సమాఖ్య తరపున సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పథ్వీరాజ్, వెంకట్‌రావుపాటిల్, రవీందర్, శ్రీనివాస్, సలావోద్దీన్, మోహన్‌గౌడ్ సర్పంచి, రైతు నాయకులు పాల్గొన్నారు. అలాగే రైతులకు సంబంధించిన పనులకు సకాలంలో పరిష్కారం అయ్యేటట్లు చూడాలని అలాగే భూభారతి సమస్యలు పరిష్కారం అయ్యేటట్లు చూడాలని కోరడమైనది.

పంటమార్పిడితో అధిక దిగుబడులు

-రైతులకు శాస్త్రవేత్త అరుణ అవగాహన

చౌటకూరు, మార్చి 31, ప్రభాతవార్త:
పంట పంటమార్పిడితో నేల సారం పెరగడంతో అధికదిగుబడులు సాధించుకోవచ్చని కో-ఆర్డినేటర్ శాస్త్రవేత్త కె.అరుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చౌటకూరులోని రైతువేదికలో తెలంగాణ రైతువిజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో పంటల్లో వైవిధ్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త కె.అరుణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒకే పంటను కాకుండా వేరువేరు పంటలను సాగుచేయడంతో నేల సారం పెరుగుతుందని, తెగుళ్లను తగ్గించడానికి ఉపయోగించే సంప్రదాయ పద్ధతి వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

వేలంకు సిద్దంగా ఉన్న ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

చౌటకూరు, మార్చి 31, ప్రభాతవార్త:
మండలంలో అక్రమంగా మంజీరానది నుంచి తరలించి ఒడ్డున నిల్వచేసిన ఇసుకనిల్వలకు ఏప్రిల్ 1న వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నామాల కిష్టయ్య తెలిపారు. మండలకేంద్రమైన చౌటకూరులో 20టన్నులు, వెండికోలులో 20టన్నుల ఇసుకను వేలంవేస్తామన్నారు. ఇసుక వేలంలో పాల్గొనేవారు 5వేల రూపాయల డిడిని చౌటకూరు తహసీల్దార్ పేరిట తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో ముందుగా అందచేసి, వేలంలో పాల్గొనవల్సి ఉంటుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

నశాముక్త్ భారత్ మనందరి కర్తవ్యం

-రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 31, ప్రభాతవార్త:
భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే మానసికంగా శారీరకంగా సుదృఢమైన యువతతోనే సాధ్యమని, అందుకోసం యువత డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అప్పుడే నశాముక్త భారత్ సాధ్యమవుతుందని పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జడ్‌పిహెచ్‌ఎస్ నారాయణఖేడ్ పాఠశాలలో బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో నశాముక్త కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు రాజశేఖర్, లక్ష్మణరావు, చంద్రశేఖర్ ఆచార్య, ధన్సింగ్, హమీద్, బ్రహ్మకుమారిసమాజం సభ్యులు లక్ష్మీ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు దూరంగా ఉందాం

-పట్టణ ఎస్ఐ కె.వినయ్‌కుమార్

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
బెట్టింగ్ మహమ్మారికి యువత దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని జహీరాబాద్ టౌన్ ఎస్ఐ కె.వినయ్‌కుమార్ అన్నారు. క్రికెట్‌ను క్రీడగా మాత్రమే చూడాలన్నారు. బెట్టింగ్‌లలో ఓమారు కేసునమోదయితే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఎస్ఐ కె.వినయ్‌కుమార్ యువతను ఉద్దేశించి సూచించారు.

వాటర్ షెడ్ ప్రాజెక్టు కార్యాలయం పనులు

-పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కార్యాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సిర్గాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
మండల పరిధిలోని వాసర్ గ్రామంలో నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ ప్రాజెక్ట్ నూతన కార్యాలయ పనులను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయరంగానికి ఊతమివ్వడానికి వాటర్‌షెడ్ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయన్నారు. వాసర్‌లో చేపడుతున్న పనులతో గ్రామంతోపాటు పరిసరగ్రామాల్లోని రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచి విఠల్‌రెడ్డి ఎమ్మెల్యే సంజీవరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాబార్డ్ అధికారులు దండం కృష్ణ తేజ, ఆర్‌ఓ రాధారాణి, ఏడిఎ నూతన్‌కుమార్ ఎన్‌జిఓ చంద్రశేఖర్, హనుమంతురావు, గ్రామసర్పంచి విఠల్‌రెడ్డి, ఉపసర్పంచి, రైతులు పాల్గొన్నారు.

పంచముఖి ఆంజనేయ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
పట్టణంలోని దత్తగిరి కాలనీలో కొలువున్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు మొదలయ్యాయి. మూడురోజుల పాటు కొనసాగే పూజా కార్యక్రమాలతో మంగళవారం వేద బ్రాహ్మణులు ప్రతిష్ఠాపనకు శ్రీకారంచుట్టారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాదవితరణ చేశారు. ఏప్రిల్ 2న హనుమాన్‌జయంతిని పురస్కరించుకుని ఆలయం ఆవరణలో తయారుచేసిన రాతి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, ఆదిశంకరాచార్యుల విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలు పూర్తయ్యేలా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమపీఠాధిపతి వైరాగ్యశిఖామణి అవదూతగిరిమహారాజ్ (అప్పగారు), సిద్ధేశ్వరమహారాజ్‌ల ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆలయకమిటీ గౌరవ అధ్యక్షులు అల్లాడి వీరేశంగుప్తా, అధ్యక్షులు ఎన్.గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్.నరసింహారెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రభాకర్‌చారి, సంయుక్తకార్యదర్శి కె.నరేంద్రచారి, కోశాధికారి సునీల్‌కుమార్‌లు తెలిపారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనకు ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎస్.ఉజ్వల్‌రెడ్డి, మాజీ ఎంపి బిబిపాటిల్, మాజీ డిసిసిబి చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ తదితరులు హాజరవుతున్నారన్నారు.

సిర్గాపూర్ పిహెచ్‌సిలో బాలికలకు టీకాలు

సిర్గాపూర్ పిహెచ్‌సిలో బాలికలకు టీకాలు ఇస్తున్న దృశ్యం

సిర్గాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం 14సంవత్సరాల వయసుగల బాలికలకు హెచ్‌పివి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాస్‌రావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 31, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మున్సిపల్‌పరిధిలోని 8వ వార్డులో 1.సోనాయి పూలమ్మ, 2.సోనాయి మణెమ్మ, 3.కర్కాని లచ్చుమ్మ, 4.సత్యాగమ్మ స్వరూప, 5.కర్కాని సుజాత, 6.ఎరుపుల సక్కమ్మలకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇంటికి ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్‌లు భూమిపూజ చేశారు. గృహనిర్మాణం విజయవంతంగా పూర్తవ్వాలని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో జుబేదాబేగం, నజీర్ మొయొద్దీన్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వైస్‌చైర్మన్ దారం శంకర్, సురేఖ, మహేష్, లక్ష్మణ్, బాణపురం రాజు, షారుఖ్, వివేకానంద, మహేందర్, గోపాల్‌రెడ్డి, సుబుర్ నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు సాయిలు, మాజీ కౌన్సిలర్ నర్సింలు, ప్రశాంత్, విట్టల్, సాయిచరణ్, దిగంబర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్ పథకం

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
నిరుపేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్ పథకం అని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లోని లబ్దిదారులకు మంగళవారం మాజీమంత్రి చంద్రశేఖర్ కార్యాలయలంలో 18లక్షల35వేల500 రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను రామలింగారెడ్డి పార్టీ నాయకులతో కలిసి అందచేశారు. కార్యక్రమంలో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావుపాటిల్, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, సర్పంచులు వీరారెడ్డి, రాజ్‌కుమార్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, సత్వార్, ఇప్పేపల్లి సొసైటీ మాజీ చైర్మన్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు హుగ్గెల్లి రాములు, శేఖర్, విష్ణు, ఫైజ్ తదితరులు పాల్గొన్నారు.

కాగ్ నివేదిక ప్రభుత్వానికి చెంప పెట్టు

-పాలన గాడితప్పిందనేందుకు రిపోర్టు ఉదాహరణ
-ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి

రామచంద్రాపురం, మార్చి 31, ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వానికి కాగ్ నివేదిక చెంపపెట్టు అని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్థవ్యస్థంగా ఉందని, ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా గాడితప్పిందని కాగ్ నివేదిక బయటపెట్టిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అశాస్త్రీయంగా ఉందని కాగ్ నివేదిక ద్వారా తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన కాగ్ నివేదికతో బహిర్గతమైందన్నారు. సిఎం ఎస్సీ, ఎస్టీ బిసిలపై చూపిస్తున్నది కేవలం పదవులమీద ప్రేమేనన్నారు. సోషల్ వెల్ఫేర్ కోసం 25,971 కోట్లు కేటాయించి, ఖర్చుచేసింది 9721 కోట్లని (37శాతం) అన్నారు. సిఎం చెబుతున్న పీపుల్స్ బడ్జెట్ అంతా ఫాల్స్ అని విమర్శించారు. రెవిన్యూ మిగులు ఉన్న రాష్ట్రాన్ని 9420కోట్ల రెవిన్యూ లోటులోకి నెట్టేసి, రాష్ట్ర ఆర్థిక క్రమశిక్షణను పాతాళానికి తొక్కేశారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని ఉల్లంఘించి అప్పులుచేసి రాష్ట్రాన్ని అప్పులరాష్ట్రంగా (5,62,662 కోట్ల)కు మార్చారని దుయ్యబట్టారు.
బడ్జెట్‌లో కేటాయించి ఖర్చుచేయకుండా ఉన్న డబ్బులు ఎటు పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి మూటలు మోస్తున్నట్లు అనేకమైన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్న మైల్ అంజిరెడ్డి ఈసందర్భంగా అన్నారు.

బిజెపిని మరింత పటిష్టం చేయాలి

-బిజెపి రాష్ట్ర కార్యదర్శి పరిణిత

సమావేశంలో మాట్లాడుతున్న పరిణీత, వాళ్దాస్ రాధామల్లేష్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:
నర్సాపూర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీని మరింత పటిష్టం చేయాలని బిజెపి రాష్ట్రకార్యదర్శి పరిణిత అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ అధ్యక్షతన బిజెపి మండల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి పరిణిత హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో గతంలో కంటే బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఆయా మండలాల బిజెపి అధ్యక్షులు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాని కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అంతేగాక ఈకార్యక్రమంలో పండిత్ దీన్‌దయాల్ ప్రశిక్షణ తరగతుల నిర్వహణ తేదీల కోసం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని రాష్ట్ర కార్యదర్శి పరిణిత తెలిపారు.
కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, నాయకులు మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడు నీరుడి చంద్రయ్య, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్ తనిఖీ

గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సౌజన్య

సంగారెడ్డి టౌన్, మార్చి 31, ప్రభాతవార్త:
జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి జి.భవానిచంద్ర ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసాకేంద్రాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా న్యాయమూర్తి సౌజన్య మాట్లాడుతూ భరోసాకేంద్రాన్ని సందర్శించే బాధితులకు తక్షణమే న్యాయపరమైన సూచనలు, సలహాలు అందించాలని, పోక్సో చట్టం, మహిళాచట్టాలపై అవగాహనకల్పిస్తూ న్యాయసహాయం కల్పించాలన్నారు. లైంగికచర్యలకు పాల్పడేవారిపై కఠినశిక్షలు ఉంటాయని హెచ్చరించారు. వృద్ధులపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి వారి సంరక్షణకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో భరోసాకేంద్రం అధికారులు, ఓల్డ్ ఏజ్ హోమ్ అధికారులు తదితరులు ఉన్నారు.

హెచ్ఐవిపై అవగాహన సదస్సు

సదస్సులో పాల్గొన్న ఓయు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు, లెక్చరర్లు

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో ఆచార్య డిగ్రీ కళాశాల, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవిపై జిల్లాస్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాత్రలపై, వ్యాధిసంక్రమణ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి ఎయిడ్స్ డైరెక్టర్ అజయ్ మాట్లాడుతూ రక్తపరీక్షలు, చికిత్స సలహాసూచనలపై సంప్రతించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు, స్కిట్లు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆచార్య, వశిష్ట కళాశాలల ప్రిన్సిపాల్‌లు డాక్టర్ చింతల హరికుమార్, సిద్దారెడ్డి, ప్రోగ్రాం అధికారులు వెంకట్రాంరెడ్డి, నందుగౌడ్, శకుంతల, రాములు, ప్రీతి, ముజాఫర్, మారుతిరావు, అమర్నాథ్, దీపిక, దత్తు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏప్రిల్ 4న ఇసుక నిల్వలు వేలం పాట

చిలిపిచెడ్, మార్చి 31, ప్రభాతవార్త:
చిలిపిచెడ్ మండలంలో అక్రమంగా మంజీరానది నుండి తరలించి అజ్జమరి గ్రామశివారులోని నిల్వచేసిన ఇసుకనిల్వలకు ఏప్రిల్ 4వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సహదేవ్ తెలిపారు. మండలపరిధిలోని బండపోతుగాళ్ గ్రామ శివారులోని 16 అజ్జమరి 48 ట్రాక్టర్లు 80 టన్నులు ఇసుక నిల్వలను ఇటీవల స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా నిల్వచేసిన ఇసుకను సీజ్‌చేశామని, వేలంపాటలో పాల్గొనేందుకు ఆసక్తిగలవారు రూ.5వేలు డిడి తహసీల్దార్, చిలిపిచెడ్ పేరున ముందుగా జమచేయాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 2వ తేదీలోగా డిడి తహసీల్దారు కార్యాలయంలో అందజేసిన అనంతరం వేలంపాటలో పాల్గొనేందుకు అర్హులని సూచించారు. వేలంపాటలో పాల్గొనే వారెవరైనా నిర్దేశించిన సమయంలోగా డిడిలు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ సహదేవ్ ఈసందర్భంగా తెలియజేసారు.

సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలి

-ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, మార్చి 31, ప్రభాతవార్త:
కొల్చారంమండలం తుక్కాపూర్ గ్రామ శివారులోని మంజీరానది ప్రాంతాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంజీరానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తే ఎడారిని తలపించే పరిస్థితి ఉందన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని కోరగా ప్రభుత్వం స్పందించి ఈ నెల 23వ తేదీన నీటి విడుదలకు జిఓ జారీచేసిందని, కాంగ్రెస్ నాయకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు నీటివిడుదల జరగడంలేదని ఆరోపించారు. నీటిని విడుదలచేయకపోతే మంజీరానది ప్రాంతంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుక్కాపూర్ సర్పంచి దొడ్ల ఆంజనేయులు, మండలపార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, యూత్ అధ్యక్షుడు సంతోష్‌రావు, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు యాబన్నగారి రవితేజరెడ్డి, సర్పంచులు వినోద్‌నాయక్, నాయకులు పాశం శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, ఉపసర్పంచి ఆరే రవీందర్, అరిగే విజయ్‌కుమార్, చిట్కుల సురేష్, వేమారెడ్డి, గోదావరి, ప్రభాకర్, చిట్యాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నారాయణఖేడ్, మార్చి 31, ప్రభాతవార్త:
జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్ స్వగృహంలో లబ్దిదారులకు మంజూరు అయిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితకుటుంబాలకు మున్సిపల్ చైర్మన్ నగేష్‌శెట్కార్ చేతులమీదుగా పంపిణీచేశారు. కార్యక్రమంలో పిసిసిసభ్యులు కె.శ్రీనివాస్, మండలాధ్యక్షులు తాహిర్‌అలీ, కౌన్సిలర్ వివేకానంద మహేందర్, సర్పంచులు చెన్ను, గోరక్, రషీద్, తోసిఫ్, బుసిరెడ్డి పాల్గొన్నారు.

అంటరానితనాన్ని పారదోలుదాం

-పౌరహక్కుల సభలో ఎస్ఐ కాశీనాథ్

పౌరహక్కులదినోత్సవసభలో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ కాశీనాథ్

జహీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:
సమాజంలో పేరుకుపోయిన అంటరానితనాన్ని పారద్రోలి నవ సమాజాన్ని నిర్మిద్దామని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ఎం.కాశీనాథ్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని తూముకుంట గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవసభలో ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్టీలు విద్య, ఉపాధిరంగాల్లోగల ప్రత్యేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐ, ఎస్‌సి వెల్ఫేర్‌శాఖ అధికారులు, జిపిఓ, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగారంలో పౌరహక్కుల దినోత్సవం

అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిలిపిచెడ్, మార్చి 31, ప్రభాతవార్త:
ప్రతిపౌరుడు హక్కుల సాధన కోసం పాటు పడాలని చిలిపిచెడ్ మండల ఎస్ఐ నర్సింలు, ఆర్ఐ సునీల్ అన్నారు. మండలంలోని గంగారం గ్రామంలో మండల అధికారుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నర్సింలు మాట్లాడుతూ...దేశంలోని ప్రతిపౌరుడు తమహక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇక కొన్నిప్రాంతాలలో కులవివక్ష కొనసాగుతుందని, దానిని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా హక్కుల సాధన దిశగా అందరూ అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సునీల్‌చౌహాన్, సర్పంచి సుదీర్‌రెడ్డి, కార్యదర్శి అశోక్, రెవెన్యూసిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి

-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గుమ్మడిదల, మార్చి 31, ప్రభాతవార్త:
వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. కొల్చారం మండలపరిధిలోని తుక్కాపూర్‌గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొల్చారం మండలం తుక్కాపూర్‌గ్రామంలో గ్రామానికిచెందిన దానయ్యయశోద, బాలయ్య బుజ్జమ్మ దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు. సర్పంచి దొడ్ల ఆంజనేయులు, ఉపసర్పంచి ఆరె రవీందర్, మండల నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజరెడ్డి, సర్పంచులు దొడ్ల ఆంజనేయులు, వినోద్‌నాయక్, మోహన్, నాయకులు వేమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ముగిసిన కరాటే శిక్షణ

పుల్‌కల్, మార్చి 31, ప్రభాతవార్త:
తెలంగాణ సమగ్ర శిక్ష సంగారెడ్డి డివిజన్ ఆధ్వర్యంలో 3 నెలలుగా 4 మండలాల్లో బాలికలకు ఆత్మరక్షణ కోసం కొనసాగుతున్న కరాటే పోటీలు ముగిసాయి. సంగారెడ్డి, పుల్‌కల్, చౌటకూరు, కంది మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో విద్యను అందుకుంటున్న బాలికలకు కరాటేలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో 650మంది బాలిలకు కుంగ్‌ఫూ మాస్టర్లు మల్లేశం, రాజులు కరాటేలో శిక్షణ అందించారు. మండలపరిధిలోని బస్వాపూర్ శివారులోని ఓఫంక్షన్‌హాల్‌లో మంగళవారం కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణపొందిన బాలికలకు ఎంఈఓ శంకర్ ప్రశంసాపత్రాలు, మొమెంటోలు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచులు పార్కల రాంరెడ్డి, అనసూయభూంరెడ్డి, దాకూరి స్వప్నసురేందర్‌గౌడ్, నందికంటి శ్రీనివాస్‌ముదిరాజ్, పడమటి రమేష్, బచ్చుగూడెం సునీతాప్రవీణ్‌రెడ్డి, లావణ్యకృష్ణారెడ్డి, గీతారాణిరమేష్, పుల్లంగారి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీచేసిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మార్చి 31, ప్రభాతవార్త:
నారాయణఖేడ్‌మండలం సంజీవన్‌రావ్‌పేట్ గ్రామానికి చెందిన భుజంగ పారవ్వకి రూ.45,000, ఉప్పరి లక్ష్మయ్యకు రూ.33,000, కంగ్టి మం దలం తుర్కవడగామగ్రామానికి చెందిన పీరవ్వకు రూ.9500, నిజాంపేట్ మండలకేంద్రానికి చెందిన విజయకుమార్‌కి రూ.35,000, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సాయిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ ఎంపిపి సాయిరెడ్డి, సర్పంచులు వెంకటేశం, భూపాల్, శరణప్ప మాజీ సర్పంచులు నవాబ్, రాజునాయక్, రవీందర్‌నాయక్, రాజప్ప, ఉప సర్పంచి రామచందర్, నాయకులు పవన్, సుధాకర్, సత్యం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.